జార్జి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మల్లయ్యయాదవ్

జార్జి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటు

కోదాడ రూరల్, జూన్ 1: తెలంగాణ ఉద్యమకారుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి, విశ్రాంత ఉపాధ్యాయులు బచ్చలకూరి జార్జి మృతి బీఆర్ఎస్ పార్టీకి, వారి కుటుంబానికి తీరని లోటని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధి తమ్మరలో జార్జి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడారు. అనంతరం జార్జి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. పట్టణ అధ్యక్షులు ఎస్‌కే నయీం, కర్ల సుందర్‌బాబు, కనగాల శ్రీధర్, కోదాటి కృష్ణయ్య, గుండె రాజేష్, సుంకర అబిధర్‌నాయుడు ఉన్నారు.

కాపుగల్లులో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సుబ్బారావు

వైద్య శిబిరాల

సద్వినియోగంతో ప్రజలకు మేలు

కోదాడ రూరల్, జూన్ 1: సేవా సంస్థ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ వైద్యులు జాస్తీ సుబ్బారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావులు అన్నారు. ఆదివారం మండల పరిధి కాపుగల్లులో సూర్యాపేట లయన్స్ క్లబ్ అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఆపరేషన్ అవసరమైన వారు జిల్లా కేంద్రానికి రావాలని సూచించారు. వైద్యులు స్వాతి, భీష్మప్రియ, ఆర్గనైజర్ వీరేంద్రచారి, విశ్రాంత ఉపాధ్యాయులు రావెళ్ల సీతారామయ్య, పెద్దనాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆవిర్భావ ఉత్సవాలు

విజయవంతం చేద్దాం

పాలకవీడు, జూన్ 1: నేడు బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ ఉంటుందని, అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రవినాయక్, సత్యనారాయణరెడ్డి, నాగయ్య, భిక్షం, జాన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సైదిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి గణేశ్‌కు ఎన్టీఆర్ అవార్డు

సూర్యాపేట టౌన్, జూన్ 1: గత మూడు దశాబ్దాలుగా మనం వికాస వేదిక ద్వారా చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తన స్వీయ రచన ద్వారా చేసిన సాహితీ సేవలకు గుర్తింపుగా సూర్యాపేటకు చెందిన సాహితీవేత్త పెద్దిరెడ్డి గణేశ్ ఎన్టీఆర్ స్మారక అవార్డును అందుకున్నారు. విజయవాడకు చెందిన ప్రముఖ సాహితీ సాంస్కృతిక సంస్థ ఎక్స్‌రే ఆధ్వర్యంలో శనివారం రాత్రి విజయవాడలో సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సినీ నటుడు రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. ఎక్స్‌రే ప్రధాన సంపాదకులు కొల్లూరు అధ్యక్షత వహించారు. సూర్యాపేటకు చెందిన శ్రీనివాస్, వెంకన్న, ఉప్పు శ్రీనివాస్, మధుకుమార్, శ్యాంప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వడ్డెరలకిచ్చిన హామీలు అమలు చేయాలి

సూర్యాపేట టౌన్, జూన్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వడ్డెరలకు అనేక రకాల హామీలిచ్చిందని, వాటిని అమలు చేయడం లేదని తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు విమర్శించారు. ఆదివారం స్థానికంగా సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షులు ఇరుగుదిండ్ల అంజయ్య, మహిళా అధ్యక్షురాలిగా కుంచం గోపమ్మ, ప్రధాన కార్యదర్శిగా కుంచం సురేష్, ఉపాధ్యక్షులుగా ఓర్సు జోసఫ్, ఓర్సు పాపయ్య, వేముల శ్రీనివాస్‌లతో పాటు ఇతర కార్యవర్గాన్ని నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. పీట్ల మల్లేష్, గణేష్, దేవరాజ్, దుర్గయ్య, శ్రీనివాస్, ఉపేందర్, సైదులు, రవి, రాకేష్, ప్రభుకిరణ్, భార్గవ్, రాంబాబు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

చివ్వెంల, జూన్ 1: శతాధిక వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందిన ఘటన మండలంలోని ఉండ్రుగొండలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కాంపాటి లాలమ్మ (102) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. తన పనులు తానే స్వయంగా చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు చెప్పారు. లాలమ్మకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు సంతానం కాగా మనుమలు, మనుమరాల్లు, ముని మనుమలు కలిపి మొత్తం 50 మంది వారసులను చూసినట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నీహెచ్ పద్మావతి

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే లాభాలు

భారత వరి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. పద్మావతి

నేరేడుచర్ల, జూన్ 1 : రానున్న ఖరీఫ్‌లో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని భారత వరి పరిశోధన ప్రధాన శాస్త్రవేత్తలు నీహెచ్ పద్మావతి, మానస సూచించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా ఆదివారం మండలంలోని మేడారంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. పంట ఉత్పత్తి, నేల ఆరోగ్యం, వనరుల నిర్వహణను మెరుగుపరచడంపై రైతులు దృష్టి సారించాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా సరైన మోతాదులో ఎరువులు, మందులు వినియోగించాలని చెప్పారు. నేరుగా విత్తే వరి సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. పురాతన పద్ధతులతో పాటు తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని సమన్వయం చేయడంతో దిగుబడి పెరుగుతుందని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త కిరణ్, భారతీయ వరి పరిశోధన శాస్త్రవేత్త కవిరాజు, షరత్, ఏవో జావిద్, రైతులు పాల్గొన్నారు.

ఏటీఎంలో నగదు చోరీ

గ్యాస్ కట్టర్‌తో షట్టర్‌ను కట్ చేసి రూ.20 లక్షలతో దుండగుల పరారీ

హుజూర్‌నగర్‌లో ఏటీఎం వద్ద వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

హుజూర్‌నగర్, జూన్ 1 : హుజూర్‌నగర్‌లోని ఏటీఎంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించిన సీఐ చరమంద రాజు వివరాల ప్రకారం.. పట్టణంలోని లింగగిరి రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం తెల్లవారు జామున రెండున్నర గంటల సమయంలో కారులో వచ్చిన నలుగురు దుండగులు గ్యాస్ కట్టర్ సహాయంతో షట్టర్ కట్ చేశారు. లోపలికి ప్రవేశించి సుమారు రూ.20 లక్షల నగదు దొంగిలించి ఏటీఎంకు నిప్పు పెట్టి ఉడాయించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని గమనించిన లారీ డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆలోపే దుండగులు పరారైనట్లు చెప్పారు. క్లూస్ టీంతో వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. హుజూర్‌నగర్ పట్టణంలో చాలా చోట్ల నిఘా నేత్రాలు పనిచేయకపోవడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సీసీ కెమెరాలు పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

నేరేడుచర్ల, జూన్ 1 : ఈనెల 3 నుంచి 18 వరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సురిగి సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3న బోడల్‌దిన్నలో, 4న యల్లారంలో, 5న జానల్‌దిన్న, 6న దాచారం, శ్రీరాంగనర్, 9న ఫత్తెపురం, 10న మేడారం, బక్కయ్యగూడెం, 11న చిల్లేపల్లి, చింతకుంట్ల, 12న పెంచికల్‌దిన్న, కల్వల దిన్న, తెలగరామయ్యగూడెం, 13న సోమారం, బూర్గులతండా, 16న కల్లూరు, మకుందాపురం, లాల్‌లక్ష్మీపురం, 17న నేరేడుచర్ల, రాంపురం, కమలానగర్, శాంతినగర్, బట్టవానికుంట, పాతనేరేడుచర్ల, 18న దిర్శించర్ల, కందులవారిగూడెం, ఇంజవారిగూడెం, పీర్‌సాహెబ్‌గూడెం, కోటయ్యగూడెం, రోళ్లవారిగూడెం, తోకలవారిగూడెం, నర్సయ్యగూడెం, జగ్గతండా, ముసివొడ్డుతండాలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గాలి మిషిన్ వర్కర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

తీర్మానం చేస్తున్న గాలి మిషిన్ ఓనర్స్ అండ్ వర్కర్స్

సూర్యాపేటటౌన్, జూన్ 1: టైర్‌కు పంక్చర్ వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలపాలై సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలి మిషిన్ వర్కర్‌ను ఆదుకోవాలని తెలంగాణ టైర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ బాబా, గౌరవాధ్యక్షులు పెద్ది బాలకృష్ణ కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో గాలి మిషిన్‌లను బంద్ చేసి ప్రమాదం బారిన పడిన వర్కర్ కుందన్‌కుమార్‌కు ఆర్థిక సాయం చేసేందుకు తీర్మానించుకుని మాట్లాడారు. గాలి మిషిన్ ఓనర్లు, వర్కర్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆరోగ్య భద్రతా పథకాలు లేకపోవడంతో ప్రమాదవశాత్తు గాయాలపాలైతే ఆర్థికంగా కుంగిపోవాల్సి వస్తుందన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు గాయాలపాలై చికిత్స పొందుతున్న కుందన్‌కుమార్‌కు ప్రతి గాలిమిషిన్ ఓనర్ ఆర్థిక సాయాన్నిఅందించేందుకు సహకరించాలని కోరారు. డేవిడ్, నాగయ్య, పాషా, వెంకటేష్, జీవన్, సుభాని, శంషుద్దీన్, జమాల్, ఎల్లయ్య, ఇస్మాయల్ తదితరులు పాల్గొన్నారు.

'ములకలపల్లి కుమారి జీవితం ఆదర్శం'

కుమారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి, నర్సిరెడ్డి, నాయకులు

మునగాల, జూన్ 1: కమ్యూనిస్ట్ యోధురాలు ములకలపల్లి కుమారి జీవితం మహిళా లోకానికి ఆదర్శమని అఖిల భారత వ్యవసాయ, కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం కొక్కిరేణి గ్రామంలో కుమారి దశదిన కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆమె పార్టీకి చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మల్లు నాగార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు, యాదగిరిరావు, వెంకటరాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో అవతరణ వేడుకలు

గరిడేపల్లి, జూన్ 1 : గరిడేపల్లిలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు నేడు నిర్వహించనున్నట్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుగులోత్ కృష్ణనాయక్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి, జూన్ 1 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆలయ అర్చకులు నృసింహుడికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'ముఖాముఖీ'ని జయప్రదం చేయాలి

నేరేడుచర్ల, జూన్ 1 : వ్యవసాయ సాగులో చేపట్టాల్సిన ఆధునిక పద్ధతులపై రైతులతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివారం ఏవో జావిద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2న దిర్శించర్ల, 4న సోమారం, 5న కల్లూరు, 10న పెంచికల్‌దిన్నెలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులకు సాగులో సలహాలు సూచనలు ఇవ్వడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులు హాజరు కావాలని కోరారు.

మాజీ సర్పంచ్ మృతికి నివాళి

చిలుకూరు, జూన్ 1: మండల పరిధిలోని నారాయణపురం గ్రామ మాజీ సర్పంచ్ బూర ఆంజనేయులు (70) ఆదివారం అనారోగ్యానికి గురై గుండెపోటుతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మృతిపట్ల మాజీ ప్రజాప్రతినిధులు, సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామస్తులు, సంతాపం వ్యక్తం చేశారు.

సీపీఐ పట్టణ కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్, జూన్ 1: హుజూర్‌నగర్ సీపీఐ పట్టణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా గుండు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా సోమగాని కృష్ణ, మామిడి వెంకయ్యతో పాటు 14 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వెంకటేశ్వర్లు, రాములు, రమేష్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

అర్జంటుగా కావలెను
Part time/full time jobs PMCCS SVE ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. అర్హత:Inter/Degree, Cont:9010925134, 8688689268.
NLG_329463

PLOT FOR SALE
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

చిలుకూరులో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ఆత్మకూరులో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మీయ సమ్మేళనంలో..

చిలుకూరు, జూన్ 1: మండల పరిధిలోని కొండాపురంలోని జడ్పీహెచ్ఎస్‌లో 2004-2005 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వారు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో ఆడిపాడారు. కార్యక్రమంలో అజయ్, విజయ్, గోపాలరావు, నరేశ్, కిశోర్, సురేశ్, విజయలక్ష్మిలతో పాటు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్, జూన్ 1 : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఉజ్వల జూనియర్ కళాశాలలో 2008-2009లో ఇంటర్ విద్యనభ్యసించిన ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్థానికంగా నిర్వహించారు. నాడు తమకు విద్య నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాటి కళాశాల అధ్యాపకులు సైదులు, మల్లికార్జున్, అజయ్, శ్రీనివాస్, రవి, కృష్ణమూర్తి, శ్రావణ్, సుధాకర్, షాహీన్‌బేగం, హేమలత, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్.ఎస్, జూన్ 1 : ఆత్మకూర్.ఎస్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను సన్మానించారు. పుష్పాల వీరన్న, శ్రీనివాస్, జాని రెడ్డి, శ్రీను, రమేష్, లింగారెడ్డి, అజ్మత్ హుస్సేన్, విజయలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి రాష్ట్ర స్థాయి

పోలీసు సేవా పతకాలు

సూర్యాపేటటౌన్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డులకు సూర్యాపేట జిల్లా పోలీసులు ఎంపికయ్యారు. పి.సాగర్‌రావు (హెడ్ కానిస్టేబుల్, కోదాడ టౌన్ పీఎస్), వి.వెంకటరమణ (హెడ్ కానిస్టేబుల్, కోదాడ టౌన్ పీఎస్), సీహెచ్.లింగయ్య(ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, సూర్యాపేట జిల్లా ఆర్మ్‌డ్ విభాగం), ఎం.నాగమోహన్(ఏఆర్ కానిస్టేబుల్, సూర్యాపేట జిల్లా ఆర్మ్‌డ్ పోలీసు విభాగం)లు పోలీసు సేవా పథకాలకు ఎంపికయ్యారు. జిల్లా ఎస్పీ నరసింహ అభినందనలు తెలిపారు.

'రజాకార్, పుష్ప-2 సినిమాలకు అవార్డులు సరికాదు'

నేరేడుచర్ల, జూన్ 1: విద్వేషం విరజిమ్మిన సినిమాలకు గద్దర్ అవార్డు ఇవ్వడం సరికాదని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు విమర్శించారు. ఆదివారం స్థానిక శ్రీకాంతచారి భవన్‌లో మాట్లాడారు. అడవి తల్లి కోసం తన ఆటాపాటను అంకితం చేసిన మహనీయుడు గద్దర్ అని అన్నారు. అలాంటిది ఆయన పేరుతో ఏర్పాటు చేసిన స్మారక అవార్డును అడవిని ధ్వంసం చేసే ఎర్రచందనం పాత్రకు ఇవ్వడం గద్దర్‌ను అవమానించడమేనన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరించి అవమానపరిచిన రజాకార్ చిత్రానికి ఉత్తమ వారసత్వ సినిమా అవార్డు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్ ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ ప్రచార జాతరలో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడుల బలోపేతమే

టీఎస్ యూటీఎఫ్ ధ్యేయం

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 1 : హుజూర్‌నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ బడుల బలోపేతానికి టీఎస్ యూటీఎఫ్ పని చేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు ప్రచార జాతను మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సీనియర్ నాయకులు చెన్న సైదులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జహూర్ ఆలం, పొదిల సైదులు, మామిడి వెంకటేశ్వర్లు, ఆర్.దామోదర్, కమల, రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, చిరంజీవి తదితరులున్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో బొడ్రాయి ప్రతిష్ఠ

మేళ్లచెర్వు, జూన్ 1: మండల పరిధిలోని కందిబండ చెన్నకేశవస్వామి నూతన ఆలయంలో బొడ్రాయి ప్రతిష్ఠా కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ కొంకపాక సుబ్రహ్మణ్య శర్మ, అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, తిరునగరి శ్రీనివాసాచార్యులు, నరసింహాచార్యులు, కేశవాచార్యులు, గోపాలాచార్యులు వేదమంత్రాలతో పూజలు జరిపించారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక

పెన్‌పహాడ్, జూన్ 1 : పెన్‌పహాడ్ యాదవ సంఘం మండల కమిటీని ఆదివారం సూర్యాపేట మహర్షి డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గోర్ల అంజయ్యయాదవ్‌ను, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శిగా కమ్మల లింగయ్యయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్‌యాదవ్ తెలిపారు. అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. యాదవుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ముందుంటానన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

నూతనకల్, జూన్ 1 : మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రైతులు జీలుగ విత్తనాల కోసం పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ అందించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈవోలు భవ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మునగాల, జూన్ 1: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో నేటి నుంచి సబ్సిడీపై పచ్చిరొట్టె జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏవో బుంగ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చినట్లు చెప్పారు. సబ్సిడీ 50 శాతం పోను 30 కేజీల బస్తా రూ. 2,137.50 చెల్లించాలని సూచించారు. అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ సదస్సును విజయవంతం చేయాలి

గరిడేపల్లి, జూన్ 1 : అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన 5న హుజూర్‌నగర్ టౌన్‌హాల్‌లో జరిగే సదస్సును విజయవంతం చేయాలని ప్రజా చైతన్య వ్యవస్థాపకులు, గరిడేపల్లికి చెందిన బాదె నర్సయ్య కోరారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ చరమందరాజు హాజరు కానున్నారని చెప్పారు. అధిక సంఖ్యలో నియోజకవర్గ ప్రజలు పాల్గొనాలని కోరారు. పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

'ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదాం'

చివ్వెంల, జూన్ 1: ప్రజా సమస్యల పరిష్కారానికి భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దం కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల 15వ మహాసభలో పాల్గొని మాట్లాడారు. దేశంలో మత రాజకీయాలకు కేంద్రం తెర లేపిందని ఆరోపించారు. ఖమ్మంపాటి అంతయ్య, లింగయ్య, రాము, సతీశ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రాంబాబు, అశోక్ కుమార్, లింగయ్య, రామలింగం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సామేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

నూతనకల్, జూన్ 1 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాస శంకర్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు 51 వేల భారీ మెజారిటీతో ఏ ఎమ్మెల్యే గెలువలేదన్నారు. కార్యక్రమంలో భవాని శంకర వేణుగోపాల్, సత్యనారాయణ, వెంకటనారాయణ, నగేష్, శ్రీనివాస్, గణేష్, వీరస్వామి తదితరులు ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సూర్యాపేటటౌన్, జూన్ 1 : ఓ ఇంట్లో దొంగలు పడి రెండు సెల్‌ఫోన్‌లు, బంగారు, వెండి నగలు అపహరించుకుపోయిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సారగండ్ల రంగయ్య నివాసంలో చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. సారగండ్ల రంగయ్య తన పెద్ద కుమార్తె డెలివరీ కోసం ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శనివారం రాత్రి తలుపులు పగులగొట్టిన దొంగలు బీరువాలోని నగలు, సెల్‌ఫోన్లు చోరీ చేశారు. ఆదివారం ఉదయం చుట్టుపక్కల వారు ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. రంగయ్య తిరిగొచ్చి చూడగా కొంత వెండి, బంగారం నగలు అపహరించినట్లు గమనించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి క్లూస్ టీమ్‌తో ఆధారాలను సేకరించారు. ఫింగర్ ప్రింట్లు, సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.